క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కల్లూరు: ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా ఆదివారం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల కర్నూలు జిల్లా సమన్వయకర్త ఐ.శ్రీదేవి మెడికల్ క్యాంపును పర్యవేక్షించారు. అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, డాక్టర్లు శరత్ చంద్ర బృందం పాల్గొన్నారు.

మానవతా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



విజేతలకు మొమెంటోలు అందజేసిన ప్రతినిధులు

పాణ్యం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరనారాయణ స్వామి ఆలయం వద్ద చిన్నారులకు కరాటే, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇటీవల కాశీకి పాదయాత్ర చేసిన పాణ్యం వాసులను, ఆలయ భజన బృందాలను సన్మానించారు. క్రీడా పోటీల విజేతలకు మొమెంటోలు అందజేశారు. ముగ్గుల పోటీ విజేతలకు వెండి భరిణె, స్వామి వారి పుస్తకం, మొమెంటో, పతకాలు అందజేశారు. పాణ్యంకు చెందిన ప్రముఖ చిత్రకారులు శ్రీరాములు, ఏకే శ్రీనివాసులు, మదార్‌లను సత్కరించారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి విగ్రహానికి పాలాభిషేకం



వివేకానంద విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని జి.పుల్లారెడ్డి కాలేజీ సామీపాన విజ్ఞాన పీఠం స్కూల్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివేకానందుడు చిన్న వయస్సులో పాశ్చాత్య దేశాలలో స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు చేశారన్నారు. ఆయన ప్రసంగానికి మంత్రముగ్ధులైన విదేశీయులు వివేకానంద లాంటి వారు భారతదేశంలో ఉన్నారా అని ఆశ్చర్యపోయారని చెప్పారు. విజ్ఞాన సేవా సమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరియగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వెలసిన మరియగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు విచారణ గురువులు రెవ.ఫా. ప్రశాంతకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుణ్యక్షేత్రం 29వ వార్షికోత్సవం సందర్భంగా 13న సాయంత్రం జపమాల, పాప సంకీర్తనములు, దివ్యబలిపూజ అనంతరం లూర్ధుమాత కథిడ్రల్ విచారణ గురువులు సిద్ధిపోగుల దేవదాస్‌చే వాక్యోపదేశం ఉంటుందన్నారు. 14న రెవ.ఫా.తరుణ్ ఆధ్వర్యంలో జపమాల, దివ్యబలిపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 15న సాయంత్రం గ్రామం నుంచి గ్రామ శివారులో గల కొండపైకి జపమాలతో మరిమాత స్వరూపాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపు కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు ఆదోనికి చెందిన ప్రీస్ట్ ఆఫ్ ఇన్ఫ్యాంట్ జీసస్ చర్చి డీన్ రెవ.ఫా.కోల విజయరాజు ఆధ్వర్యంలో మహా దివ్యబలి పూజ ఉంటుందన్నారు. మహోత్సవాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం 3 గంటలకు బిషప్ బంగ్లా, కర్నూలు (నంద్యాల చెక్ పోస్టు) నుంచి, ప్రేమగిరి వయా నూతనపల్లె మీదుగా ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి అన్నదానం ఉంటుందన్నారు.

హుండీలోని నగదు చోరీ

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో హుండీలోని నగదు చోరీకి గురైంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా కొండపై నాలుగు ప్రాంతాల్లో హుండీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి ఆలయ ప్రాంగణంలోని హుండీని బోర్లించి, నగదును చోరీ చేస్తుండగా ఓ వ్యక్తి గమనించాడు. పరుగున గ్రామంలోకి వెళ్లి ప్రజల వెంటబెట్టుకుని కొండపైకి వచ్చి చూడగా దుండగుడు అప్పటికే పరారయ్యాడు. ఘటనపై ఎస్‌ఐ తిమ్మారెడ్డిని సమాచారం కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఏపీజీబీని వైఎస్సార్ జిల్లాలోనే కొనసాగించాలి

ఓర్వకల్లు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లాలోనే కొనసాగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓర్వకల్లులో రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఏపీ వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత వెనుకబడ్డ రాయలసీమలో మరిన్ని కార్యాలయాలు, పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా, ఉన్న వాటిని తరలించాలనుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. నాయకులు సుధాకర్, వ్య.కా.స మండల నాయకులు మల్లేష్, శ్రీరాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు

మల్లందొడ్డి స్వామి

- కళ్యాల గోత్రం కురువలకు ఆరాధ్య దైవం
- సంక్రాంతి సందర్భంగా గొల్లలదొడ్డిలో స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు
- నేటి నుంచి మూడు రోజుల పాటు వైవిధ్యంగా వేడుకలు
- ప్రత్యేకంగా గొరవయ్యల ప్రదర్శన
- తరలిరానున్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కళ్యాల గోత్రం వారు

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో వెలసిన మల్లందొడ్డి స్వాముల వారు కళ్యాల గోత్రం కురువ కులస్తులకు మహిమాన్వితుడుగా విరాజిల్లుతున్నాడు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామంలో మూడు రోజుల పాటు కళ్యాల వర్గీయులు స్వామివారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోనున్నారు.

వేడుకలలో భాగంగా గ్రామంలోని దేవర (స్వామి వారి ఆలయం), లింగాల గుడి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, ఉత్సవమూర్తులు, సాంప్రదాయక వాయిద్యాలను నిర్వాహకులు సిద్ధం చేశారు.

కళ్యాల వర్గీయులంతా ఒక్కచోటికి..

గొల్లలదొడ్డి గ్రామంలో సంవత్సరానికి ఒక్కసారి నిర్వహించే పెద్ద వేడుకకు తెలంగాణ రాష్ట్రంలోని ఎక్లాస్‌పురం, భైనపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలతోపాటు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా ప్రాంత కళ్యాల వర్గీయులు పెద్ద ఎత్తున తరలివస్తారు. అదేవిధంగా అనంతపురం జిల్లాలోని కమ్మూరు ప్రాంతాల వారు, కర్నూలు జిల్లాలోని ఏ సెంటర్, హోసూరు, కోటకొండ, తిమ్మాపురం, రాయచోటి, సోముల గూడూరు, మండలంలోని కంబదహాల్ గ్రామస్తులంతా వేడుకలలో కలుసుకుంటారు.



గొల్లలదొడ్డి గ్రామ దేవాలయంలో మల్లందొడ్డి స్వాముల ఉత్సవమూర్తి

మూడు రోజుల పాటు ఉత్సవాలు

గ్రామంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వేడుకలు వైభవంగా జరుగుతాయి. మొదటి రోజు ఉదయం కళ్యాణ వర్గీయులు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తారు. సాయంత్రం ఐదు గంటలకు గంగా పూజలో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీలో తుంగభద్ర నది వద్దకు తీసుకెళ్తారు. అక్కడ రాత్రి పూజల అనంతరం మరుసటి రోజు స్వామివారిని పల్లకీలో గ్రామానికి తీసుకొస్తారు. భక్తుల దర్శనార్థం గ్రామంలోని లింగాల ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి ఒక రోజంతా అన్నదానం చేపడతారు. మూడవ రోజు గొరవయ్యల ప్రవేశంతో వేడుకలు తారాస్థాయికి చేరుకుంటాయి. గొరవయ్య విన్యాసాల అనంతరం స్వామి వారిని పల్లకీలో లింగాల ఆలయం నుంచి ప్రధాన ఆలయం అయిన దేవర ఇంటికి చేర్చడంతో వేడుకలు ముగుస్తాయి.

వైవిధ్యంగా పూజా కార్యక్రమాలు

గంగా పూజలో భాగంగా గ్రామం నుంచి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న నందవరం మండలం, రాయచోటి గ్రామానికి పల్లకీని తీసుకెళ్లే సందర్భంగా పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తారు. అదేవిధంగా తుంగభద్ర నదీతీరానికి బయలుదేరి మండలంలోని కంబదహాల్ మీదుగా నందవరం మండలం సోములగూడూరు గ్రామాల మీదుగా రాయచోటికి చేరుకుంటారు. అయితే కంబదహాల్, సోముల గూడూరు, రాయచోటి గ్రామాల్లోని కళ్యాల వర్గీయులు స్వామివారి రాకపోకల యందు పెద్దెత్తున స్వాగత, వీడుకోలు ఊరేగింపులను నిర్వహించడం ఆనవాయితీ. తుంగభద్ర నదీతీరంలో మంగళవారం రాత్రి ఉత్సవమూర్తికి గంగాస్నానంతో కంబడి పూజ చేసి, రాత్రి వేడుకలో భాగంగా వేట, బలి పూజలను నిర్వహిస్తారు. వేడుకలు మొత్తం ఆ కులస్తులు వాయించే సంప్రదాయ వాయిద్యాలతో నిర్వహించడం మరో విశేషం. సంప్రదాయ వాయిద్యాలైన బీరప్పడోలు, పెద్దతాళం, పిల్లన్నగ్రోవిలను అదే గోత్రం వారు వాయిస్తూ ప్రత్యేక సందడి తీసుకొస్తారు.



గతేడాది ఉత్సవాలను నిర్వహిస్తున్న కళ్యాల గోత్ర కురువలు (ఫైల్)



లింగాల ఆలయం మొత్తం వ్యాపించిన పుట్ట

గొరవయ్యల పాలపూజ ప్రత్యేకం

మల్లందొడ్డి స్వాముల వారి వేడుకలో గొరవయ్యల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలుస్తాయి. వేడుకల మూడవ రోజు గ్రామంలోకి ప్రవేశించిన గొరవయ్యలు నృత్య ప్రదర్శన అనంతరం చేపట్టే పూజా కార్యక్రమాలు ఆకట్టుకుంటాయి. గ్రామంలోకి వచ్చిన గొరవయ్యలకు ప్రధాన పూజారులు (దేవరలు) ప్రత్యేక పూజలతో కంకణ ధారణ చేస్తారు. ఈ సందర్భంలో వారు చేసే భక్తి పూజలు ఆకర్షణగా ఉంటాయి. మధ్యాహ్నం అనంతరం ప్రత్యేక పాత్రలో స్వామివారి అభిషేక పదార్థాలను (పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఎండుద్రాక్ష, గోడంబీ తదితరాలు) సేవించే సమయంలో చేపట్టే పాలపూజ పూర్తి వైవిధ్యంగా సాగుతుంది. గొరవయ్యలు పూనకంతో దేవుడు ఆవహించినట్లు ప్రవర్తిస్తూ మల్లయ్య కుక్క (భైరయ్య)గా మారి అభిషేక పదార్థాలను నేరుగా నోటితోనే తీసుకుంటారు. భక్తి భావంతో కుక్కలను అనుకరిస్తూ భౌ..భౌ.. అంటూ అరుస్తూ దాదాపు గంటసేపు భక్తి పారవశ్యంతో చేసే విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించి ప్రధాన ఆలయానికి చేర్చే సమయంలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో వేడుకలు ముగుస్తాయి.



లింగాల ఆలయంలోని దేవతామూర్తులు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



గ్రామంలో నేటి నుంచి జరిగే మల్లందొడ్డి స్వామి వారి వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. ప్రధాన ఆలయంతో పాటు, లింగాల గుడిని సైతం సిద్ధం చేశాం. వేడుకల నిర్వహణపై సుదూర ప్రాంతాల్లో ఉంటున్న కళ్యాల గోత్రం వారికి సమాచారం అందించాం.

– మల్లయ్య, ఉత్సవాల నిర్వాహక సభ్యుడు

కళ్యాల వారంతా కలుసుకుంటారు



మల్లందొడ్డి స్వామి మా గోత్రం (కళ్యాల) వారి ఆరాధ్య దైవం. చాలా మహిమలు కలిగిన దేవుడు. కురువ కులస్తులలో చాలా గోత్రాలు ఉన్నాయి. అయితే మా ఊరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే మల్లందొడ్డి స్వామి వేడుకలకు వివిధ ప్రాంతాలలో ఉండే కళ్యాల గోత్రం కురువ కులస్తులు మొత్తం పాల్గొంటారు.

– కేశవరం, ప్రధాన పూజారి

మా ఊరు చేసుకున్న అదృష్టం



మల్లందొడ్డి స్వామి వారి పూజలకు చాలా దూరం నుంచి కురువలు పెద్ద ఎత్తున వస్తారు. వారంతా సజావుగా ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కడెక్కడో ఉన్న వారంతా గ్రామానికి చేరుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ఇలాంటి ఉత్సవం గ్రామంలో జరుగుతుండటం మా ఊరు చేసుకున్న అదృష్టంగా భావిస్తాం.

– రామలింగమ్మ, గొల్లలదొడ్డి గ్రామ సర్పంచ్



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి మండల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు, కుడా మాజీ చైర్మన్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. పార్టీ మండల కన్వీనర్‌గా సోమశేఖర్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడటంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల నాయకులు ఆదివారం కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు నియోజకవర్గ నాయకులను పూలమాలలతో సత్కరించగా, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డిని శాలువా, పూలమాలతో అభినందించారు. అనంతరం నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ.. మండలంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, పార్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు చేపట్టడంతో పాటు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహుడు, మండల కార్యదర్శులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్లా హారున్, సీబీ గోవిందరెడ్డి, సర్పంచ్‌లు పాండురంగన్న, దస్తగిరి, మండల నాయకులు నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, ఎస్‌ఎం బాషా, రవిప్రకాష్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, లచ్చప్ప, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

తొంభై ఏళ్ల వేడుక.. ఆనంద డోలిక



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 90 ఏళ్ల వేడుకలు ఆదివారం పండగ వాతావరణంలో జరిగాయి. బ్రిటిష్ కాలంలో 1933లో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో అప్పటినుంచి ఇప్పటి వరకు చదివిన పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకుని నాటి మధుర స్మృతుల్ని నెమరు వేసుకున్నారు. కష్టాలు, సుఖాలు తెలుసుకుంటూ కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. ముందుగా పూర్వపు విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఇన్నేళ్ల తర్వాత తిరిగి కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వారి మాటల్లో.. 'ఏమిరా ఎలా ఉన్నావు.. ఏమి చేస్తున్నావు.. మామ బాగున్నావా.. పిల్లలు ఏమి చేస్తున్నారు.. ఎక్కడ పనిచేస్తున్నావు' అనే సంభాషణలు జరిగాయి. నీ ఫోన్ నంబర్ చెప్పు, నా నంబర్ రాసుకో.. అప్పుడప్పుడు ఫోన్ చెస్తుండూ అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాటి ముచ్చట్లు గుర్తు చేసుకుని మైమరచిపోయారు. ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ యోగక్షేమాలు చెప్పుకున్నారు. చిన్నప్పటి అల్లరి చేష్టలు గుర్తు చేసుకుని మురిసిపోయారు.అందరూ ఒకచోట కూర్చొని భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామంలో 80 ఏళ్లు నిండిన వారందరిని కమిటీ సభ్యులు సన్మానించారు. వీరందరి కలయికకు కృషి చేసిన మహానంది మండలం గాజులపల్లె జెడ్పీ స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు (విద్యా దాన్ సొసైటీ వ్యవస్థాపకులు)ను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పైబోగుల గ్రామస్తులతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, నాయకులపై దాడులు ఎక్కువయ్యాయని, అలాంటి వాటికి ఎవరూ భయపడవద్దని, అండగా ఉంటానని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భరోసానిచ్చారు. ఈ నెల 5వ తేదీన పైబోగుల గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ అత్యంత పాశవికంగా దాడులకు పాల్పడిన ఘటనలో బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. గ్రామాల్లో ఎవరికి భయపడాల్సిన పనిలేదని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా పోలీసులు కనీసం పట్టించుకోవడంలేదన్నారు. ఎవరికీ అధికారం శాశ్వతం కాదని, తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి దాడులకు పాల్పడలేదన్నారు. చిన్నచిన్న ఉద్యోగులపై టీడీపీ నాయకుల ప్రతాపం చూపడం ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందించలేక ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, మహాలక్ష్మి పథకాల కోసం రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలు ఎదురు చూస్తున్నారని ముందుగా వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటా

మండల పరిధిలోని చెనకపల్లె గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటానని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆన్‌లైన్‌లో భూమి యజమానిగా నమోదైన వారికి, సాగులో ఉన్న వారికి పరిహారం వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

కార్యకర్త మృతికి నివాళి

మంచాలకట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుమ్మరి ఈశ్వరయ్య అనారోగ్యంతో మరణించాడు. విషయం తెసుకున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ బొంతల మధుసూదన్, వైస్ ఎంపీపీ కాలునాయక్, నాయకులు రవీంద్రారెడ్డి, శివానందరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రాము, రాంభూపాల్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదృష్టం 'వరి'ంచేనా!



పెసరవాయిలో ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతన్న



బూజునూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

మండలంలో కేసీ కెనాల్ ఆయకట్టు, బోర్ల కింద రబీ సీజన్‌లో వరిసాగు చేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. కేసీ ఆయకట్టు కింద పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, బూజునూరు గ్రామాల్లో ఆదివారం రైతులు వరి నాట్లు వేసేందుకు పొలాలను ట్రాక్టర్లు, ఎద్దులతో దమ్ము చేయడం, మరికొంత మంది వరినాట్లు వేసే పనులు చేస్తూ కనిపించారు. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఏడు వేల ఎకరాల్లో వరిపంట సాగైంది. రబీ సీజన్‌లో మూడు వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

– గడివేముల

వంకాయ @ రూ.వంద

- కొండెక్కిన కూరగాయల ధరలు
- ధరలు చూసి హడలిపోతున్న ప్రజలు
- పండుగ పూట పచ్చడి మెతుకులే దిక్కంటూ నిరాశ

పాణ్యం: సంక్రాంతి పండగ నేపథ్యంలో అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. దీనికితోడు కూరగాయల ధరలు కొండెక్కడంతో సామాన్య ప్రజలు చేసేది లేక అరకొరగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఎప్పుడూ లేనంతగా నిత్యావసర సరుకులతో పాటు, కూరగాయలు ధరలు పెరిగాయి. వంటనూనె కిలో రూ.150 పలుకుతుండగా అన్ని రకాల పప్పులు రూ.80పైమాటే ఉన్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ధరలు ఇంకా పైపైకి ఎగబాకుతున్నాయి. కనీసం పండగ పూట కూడా పేద ప్రజలు, కూలి పని చేసుకొని బతికే వారు మూడు పూటలా భోజనం తినే అవకాశం లేనంతగా ధరలు మండిపోతున్నాయి. చేసేదేమీ లేక పండగకు అరకొర సరుకులను కొని తీసుకెళుతున్నారు.

షాక్ కొట్టేలా కూరగాయల ధరలు

పాణ్యం మార్కెట్‌లో కూరగాయల ధరలు ప్రజలకు షాక్ కొట్టేలా ఉన్నాయి. ఆదివారం జరిగిన వారపు సంతలో ఏ రకం కూరగాయ చూసినా కేజీ రూ.60పైగానే ఉంది. ఇక వంకాయ ధర రూ.100 పలకడం విశేషం. ఎప్పుడూ లేనంతగా వంకాయ రేటు వందకు చేరింది. ధరల కారణంగా పాణ్యంలో నిర్వహించే వారపు సంతకు వ్యాపారులు కూరగాయలను తక్కువ మోతాదులో విక్రయాలకు తెచ్చారు. పేద ప్రజలు ఆకుకూరలపై ఆసక్తి చూపుతున్నారు. కూరగాయల ధరలు చూసి ప్రజలు మండిపడుతున్నారు. కేవలం టమాట మాత్రమే కేజీ రూ.10 ఉంది. మిగతావన్నీ రూ.60 పైగానే ఉన్నాయి. ఈ ధరలను చూసి ఇక పండగ చేసుకున్నట్లు అని పలువురు నిట్టూరుస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పాణ్యం ఆదివారం సంతలో కూరగాయల విక్రయం

పాణ్యం వారపు సంతలో కూరగాయల ధరలు

కూరగాయలు (కేజీ)	ధర (రూ.)	కూరగాయలు (కేజీ)	ధర (రూ.)
ఉల్లి	40	కాకరకాయ	80
టమాట	10	బీన్స్	60
వంకాయ	100	క్యారెట్	70
అలుగడ్డ	40	దొండకాయ	50
బీరకాయ	60	పచ్చిమిర్చి	60

16న మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 16వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.